నేనెవరో తెలుసా.. నన్నే స్టేషన్‌కు రమ్మంటావా!

- పోలీసు సిబ్బందికే దమ్కీ ఇస్తున్న రౌడీషీటర్లు
- ప్రతి ఆదివారం కౌన్సెలింగ్‌కు గైర్హాజరు
- తాడేపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో 70 మందికి 20 మందే హాజరు
- ఆ కానిస్టేబుల్ ఆశీర్వాదం ఉంటే చాలు రావాల్సిన పనిలేదు
- కౌన్సెలింగ్‌కు పిలిచిన ఇతర కానిస్టేబుళ్లకు వార్నింగ్‌లు



రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న తాడేపల్లి ఎస్ఐ ఖాజావలి

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇవ్వడంలో పోలీసులు నిర్లక్ష్య వైఖరి వహిస్తున్నారు. ప్రతి ఆదివారం నిర్వహించే కౌన్సెలింగ్‌లో పోక్సో కేసులు నమోదయ్యి.. కేసులు పరిష్కారమై రౌడీషీటర్లుగా ఉన్నవారు మాత్రమే హాజరవుతున్నారు. తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో ప్రతి వారం నిర్వహించే కౌన్సెలింగ్‌కు 10 నుంచి 20 మంది మాత్రమే హాజరుకావడం గమనార్హం. కొంతమంది పోలీసులు రౌడీషీటర్లను హాజరు కావాలని ఆదేశిస్తున్నా.. ఓ కానిస్టేబుల్ మాత్రం రౌడీషీటర్లకు భరోసా ఇస్తున్నట్లు సమాచారం. ఉన్నతాధికారుల అండతో.. రౌడీ షీటర్లకు అనుకూలంగా.. స్టేషన్‌కు రావాల్సిన అవసరం లేదని చెప్పినట్లు సమాచారం. తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో మొత్తం రౌడీషీటర్లు, కేడీలు, పిక్ పాకెటర్స్ 70 మంది ఉన్నారు. పోలీస్ స్టేషన్‌కు రౌడీ షీటర్లను రమ్మని ఏ కానిస్టేబుల్ అయితే ఒత్తిడి చేస్తాడో అతనికి ఉన్నతాధికారులు, రాజకీయ నాయకుల నుంచి ఇబ్బందులు తప్పడం లేదు. దీంతో తమ ఉద్యోగాలు తాము చేసుకుంటే సరిపోతుందని వారు కూడా చేతులు దులుపుకుంటున్నారు.

పోలీసులకే వార్నింగ్..

పోలీస్ స్టేషన్లోని కానిస్టేబుల్ నిర్వాకం, నేతల అండదండలతో రౌడీషీటర్లకు ఎక్కడ లేని ధైర్యం వచ్చింది. దీంతో వారు సామాన్య పోలీసు సిబ్బందికే వార్నింగ్ స్థాయికి వచ్చేశారు. తాజాగా.. ఉండవల్లిలో టైలరింగ్ చేసుకుంటున్న ఓ బెంగాల్ వ్యక్తి ఓ మహిళకు వ్యాపార లావాదేవీల్లో భాగంగా రూ.8 వేల ఇవ్వాల్సి ఉంది. శనివారం ఓ మాజీ రౌడీషీటర్ ఉండవల్లికి వచ్చి బెంగాల్ టైలర్ వద్ద సెల్‌ఫోన్‌తో పాటు బండి లాక్కుని వెళ్లిపోయాడు. ఎవరికి చెప్పుకుంటావో చెప్పుకో అంటూ బెదిరించాడు. సదరు టైలర్ స్థానికుల సాయంతో తాడేపల్లి పోలీసులను ఆశ్రయించాడు. పోలీసులు అతనిని పిలిపించడానికి ప్రయత్నించగా.. ఆ మాజీ రౌడీ షీటర్ 'నేను ఎవరో తెలిసే మాట్లాడుతున్నావా? నేను పోలీస్‌స్టేషన్‌కు రావడం ఏంటి.' అంటూ వార్నింగ్ ఇచ్చాడు. సీతానగరంలో మరో రౌడీషీటర్‌ను కౌన్సెలింగ్‌కు రావాలని పోలీసులు చెప్పగానే 'నేనెందుకు రావాలి? మీరు పిలిచినప్పుడల్లా రావడానికి మాకు పనిలేదా.' అంటూ దురుసుగా మాట్లాడడం విశేషం. ముఖ్యమంత్రి, మాజీ ముఖ్యమంత్రి, వీవీఐపీలు, వీఐపీలు నివాసముంటున్న ప్రాంతంలో మాజీ రౌడీ షీటర్లపై నిఘా ఏర్పాటు చేయకపోతే సామాన్య ప్రజలు వ్యాపారాలు నిర్వహించుకోవడం సాధ్యపడదని పలువురు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

ఎమ్మార్పీఎస్ కన్వీనర్‌గా సుద్దపల్లి



తాడికొండ: నియోజకవర్గ ఎమ్మార్పీఎస్ కన్వీనర్‌గా నియామకపత్రం అందుకున్నట్లు తుళ్లూరు మండలం ఉద్దండరాయునిపాలేనికి చెందిన సుద్దపల్లి కోటేశ్వరరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు కిన్నెర నాగరాజు, ఇన్‌చార్జి కొమరాల శ్రీనివాసరావు మాదిగ చేతుల మీదుగా తుళ్ళూరులో జరిగిన సమావేశంలో అధికారిక ప్రకటన చేసినట్లు పేర్కొన్నారు.

5న మండల సమావేశం

తాడికొండ: తాడికొండ మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఈ నెల 5న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కె.సమతావాణి ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 11 గంటలకు మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహించనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, అధికారులు.. తమ శాఖల పరిధిలోని పూర్తిస్థాయి సమాచారంతో హాజరు కావాలని ఆమె పేర్కొన్నారు.

క్లుప్తంగా

పూర్వ విద్యార్థుల కార్యవర్గం ఎన్నిక



ఫిరంగిపురం: మండల కేంద్రంలోని సెయింట్ పాల్స్ హైస్కూల్‌లో పూర్వ విద్యార్థుల నూతన కార్యవర్గం ఎన్నిక ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు పాల్గొని, నూతన కార్యవర్గంను ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా చిట్టా వీరారెడ్డి, కార్యదర్శిగా పామిశెట్టి శౌరిరాజు, ట్రెజరర్‌గా డాక్టర్ టి.వెంకటేశ్వర్లు, ఉపాధ్యక్షుడిగా వి.బాబురావు, జాయింట్ సెక్రటరీగా పి.త్యాగరాజును ఎన్నుకున్నారు. త్వరలో నిర్వహించే పూర్వ విద్యార్థుల సమ్మేళనానికి సంబంధించి కార్యక్రమాలపై చర్చించినట్లు తెలిపారు.

వేగవంతంగా యాగశాల పనులు

ఫిరంగిపురం: వేమవరం గ్రామంలోని కాశీ విశాలాక్షీ సమేత విశ్వేశ్వరస్వామి దేవస్థానంలో నవగ్రహ, జీవ ధ్వజస్తంభ, నాగేంద్ర, చండీశ్వర, హరిహరమూర్తి, సర్వస్వతీ విగ్రహ ప్రతిష్టా మహోత్సవాలు ఈ నెల 5వ తేదీ నుంచి ప్రారంభం కానునున్నాయి. ఆలయం సమీపంలో హోమాలు నిర్వహించేందుకు యాగశాలను తాటి ఆకులు, వెదురు బొంగులతో తయారు చేస్తున్నారు. హోమాలకు ఏర్పాట్లు చేస్తున్నట్లు ఆలయ అర్చకులు పూర్ణచంద్రశాస్త్రి తెలిపారు. హోమ ఆధార పనులను వేదపండితులు పరిశీలించారు. గ్రామపెద్దలు చల్లానరిసిరెడ్డి, శ్రీనివాసరెడ్డి, శివయ్య, చల్లా శ్రీనివాసరెడ్డి పర్యవేక్షించారు.

కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా నిరసన



ఫిరంగిపురం: పొనుగుపాడు గ్రామంలో సీపీఎం ఆధ్వర్యంలో కేంద్ర బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఆదివారం నాయకులు నిరసన తెలిపారు. కేంద్ర మంత్రి నిర్మలాసీతారామన్ ప్రతిపాదించిన కేంద్ర బడ్జెట్‌లో వ్యవసాయ రంగానికి, రాష్ట్ర రాజధానికి నిధులు కేటాయించలేదని చెప్పారు. దానికి వ్యతిరేకంగా నిరసన తెలియజేస్తున్నట్లు తెలిపారు. ఈ బడ్జెట్ ప్రయివేటు రంగానికి పెద్దపీట వేసినట్లుగా ఉందని తెలిపారు. షేక్.మస్తాన్‌వలి, బాలకృష్ణ, కె., కోటేశ్వరరావు పాల్గొన్నారు.

బహిరంగ ప్రదేశాల్లో మద్యం సేవిస్తే సహించం




తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ, రూరల్ పరిధిలో బహిరంగంగా మద్యం సేవిస్తే కేసులు నమోదు చేస్తామని తాడేపల్లి సీఐ కల్యాణ్‌రాజు అన్నారు. ఆదివారం తాడేపల్లి పట్టణ పరిధిలోని ఉండవల్లి సెంటర్, మాజీ ముఖ్యమంత్రి నివాసముండే రహదారి, ఎన్టీఆర్ కరకట్ట ప్రాంతాల్లో విస్తృతంగా పర్యటించి, నివాసాల మధ్యలో బహిరంగంగా మద్యం సేవించే వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. బహిరంగంగా ఎవరైనా మద్యం సేవిస్తే తాడేపల్లి పోలీసులకు సమాచారం ఇవ్వాలని, మద్యం సేవించే వారిపై కేసులు నమోదు చేసి కోర్టుకు హాజరు పరుస్తామని తెలిపారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామన్నారు.

దత్తాత్రేయుడికి విశేష పూజలు



ఫిరంగిపురం: అమీనాబాద్ గ్రామంలోని దత్తపీఠం వార్షికోత్సవం సందర్భంగా దత్తాత్రేయ స్వామికి ఆదివారం విశేష పూజలు నిర్వహించారు. ఉదయం భక్తులు స్వామివారి చిత్రపటంతో నగర సంకీర్తన చేశారు. పీఠం వద్ద వేద పండితులు విశేష పూజలు నిర్వహించారు. మహారుద్రాభిషేకం చేశారు. కార్యక్రమాలను జయశంకర్ పర్యవేక్షించారు.

నిత్యసహాయ మాత ఆలయ వార్షికోత్సవం



మేడికొండూరు: మండలంలోని డోకిపర్రు గ్రామంలో నిత్య సహాయ మాత ఆలయ వార్షికోత్సవం ఆదివారం ఘనంగా జరిగింది. గ్రామంలో కులమతాలకు అతీతంగా ఈ పండుగను జరుపుకున్నారు. ఈ సందర్భంగా పండుగ ప్రత్యేక దివ్య పూజా బలిని ఆలయంలో విచారణ గురువు సుదురుపాటి చంద్రమోహన్ వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భక్తిశ్రద్ధలతో నిత్య సహాయ మాతను ప్రార్థించాలన్నారు. ప్రత్యేక దైవభక్తి పాటలు మహిళలు ఆలపించారు. రాత్రికి గ్రామ పుర వీధుల్లో మేళతాళాల నడుమ ఊరేగింపు జరిగింది.

శివారు..పట్టించుకునేది ఎవరు?

- శివారు ప్రాంతాల్లో గంజాయి బ్యాచ్ భయం..
- తీవ్ర ఇబ్బందులు పడుతున్న నివాసితులు



యజమానిని కారు డోర్ వేయనీయకుండా అడ్డుకుంటున్న గంజాయి బాబు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణం, రూరల్ పరిధిలోని పలు శివారు ప్రాంతాల్లో మందు బాబులు, గంజాయి బ్యాచ్ నివాసితులకు కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నారు. ఆదివారం తాడేపల్లి కనకదుర్గ వారధి, రేపల్లె కరకట్ట వెంబడి ఫుల్‌గా గంజాయి, మద్యం సేవించి ఓ యువకుడు తాళం వేసిన కారు డోర్ తీసి అందులో కూర్చుని సేద తీరుతున్నాడు. కారు యజమాని ఎందుకు డోర్ తీశావని ప్రశ్నించగా కొడతావా అంటూ మీదమీదకు వెళ్లాడు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు మాట్లాడుతూ కరకట్ట వెంబడి ప్రతిరోజు పదుల సంఖ్యలో గంజాయి, మద్యం సేవించేవారు వస్తున్నారని తెలిపారు. వీరు పూటుగా మద్యం, గంజాయి సేవించి పార్క్ చేసి ఉన్న ద్విచక్రవాహనాలను కింద పడేస్తున్నారని, చోరీకి యత్నిస్తున్నట్లు తెలిపారు. రాత్రి పగలు అనే తేడా లేకుండా గంజాయి, మద్యం సేవిస్తూ స్థానికంగా ఉన్న వారిని ఇబ్బందులకు గురిచేస్తున్నారని చెప్పుకొస్తున్నారు.

ధ్యాన పిరమిడ్ ఏర్పాటు చేయాలి



ఉండవల్లి సెంటర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న పిరమిడ్ సభ్యులు

తాడేపల్లిరూరల్: ధ్యానంతోనే ప్రజల్లో మార్పు వస్తుందని, ప్రతి ప్రాంతంలోను ధ్యాన కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు చేపట్టాలని యోగా గురువు బండారు నరసింహ, మంగళగిరి ధ్యాన పిరమిడ్ అధ్యక్షుడు శంకర్ కోరారు. ఆదివారం ఉండవల్లిలో మాంసాహారం వద్దు – శాకాహారం ముద్దు అంటూ ర్యాలీ నిర్వహించి శాకాహారం ఉపయోగాలను వివరించారు. బండారు నరసింహ, శంకర్ మాట్లాడుతూ ఉండవల్లిలో నివాసముంటున్న ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు, మంగళగిరి ఎమ్మెల్యే, మంత్రి నారా లోకేష్ ధ్యాన మందిరానికి రాజధానిలో స్థలం కేటాయించి పిరమిడ్ ఏర్పాటు చేయాలని కోరారు. చాలామంది ఆహార విషయంలో కూడా పాశ్చాత్య పోకడలకు పోయి బర్గర్లు, పీజాలు, ఇతర జంక్ ఫుడ్‌లను తమ పిల్లలకు అందిస్తున్నారని, అవి విషపదార్థాలని వారికి అర్థం కావడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో పిరమిడ్ సభ్యులు సాయిరామ్, ఝాన్సీ, రామారావు, గాయత్రి, సందీప్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు



బస్టాండ్ సెంటర్‌లో మైకులను ఏర్పాటు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి నగర పరిధిలో ట్రాఫిక్ నియంత్రించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు పట్టణ సీఐ వినోద్ కుమార్ తెలిపారు. నగరంలో పలుచోట్ల అనౌన్స్‌మెంట్ మైకులను ఆదివారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వినోద్‌కుమార్ మాట్లాడుతూ నగర పరిధిలోని కొత్త బస్టాండ్ ఎదుట, పాత బస్టాండ్ వద్ద, మిద్దె సెంటర్లలో ట్రాఫిక్‌ను నియంత్రించేందుకు ఓ కానిస్టేబుల్‌తో పాటు అనౌన్స్‌మెంట్ మైకులను కూడా ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆయా ప్రాంతాల్లో రోడ్డుపై వాహనాలు అడ్డుగా ఉన్నా, ట్రాఫిక్‌కు ఇబ్బంది కలిగించినా ఆ మైక్‌లో విధులు నిర్వహించే ట్రాఫిక్ కానిస్టేబుల్ అనౌన్స్‌మెంట్ చేసి హెచ్చరించే విధంగ చర్యలు తీసుకుంటున్నామన్నారు. కూడలిలో ఉన్న సీసీ కెమెరాలను మంగళగిరి పట్టణ పోలీస్‌స్టేషన్‌కు అనుసంధానం చేశామని, స్టేషన్‌లో ఏర్పాటు చేసిన స్క్రీన్‌లో పరిశీలించి ఆయా కూడళ్లలో ఉన్న ట్రాఫిక్ కానిస్టేబుల్‌కు సూచనలు చేసేవిధంగా ఏర్పాటు చేశామన్నారు. పట్టణ ప్రజలు, వాహనదారులు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగించకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



తాడేపల్లిరూరల్ : ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి బ్రహ్మానందపురంలో కేసీ వర్క్స్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఆదివారం సిల్వర్ జూబ్లీ ఆత్మీయ సమ్మేళన కార్యక్రమాన్ని నిర్వహించారు. పూర్వ విద్యార్థులు జ్ఞాపకాలు గుర్తు చేసుకున్నారు. పాఠశాలలో 10వ తరగతి పూర్తిచేసుకుని 25 సంవత్సరాలు అయ్యిందని తెలిపారు. ముఖ్యంగా తమ ఉపాధ్యాయులను గుర్తుచేసుకుని కృతజ్ఞతలు తెలుపుకున్నారు. ఈ కార్యక్రమంలో పూర్వపు ప్రధానోపాధ్యాయులు తాడిబోయిన నాగేశ్వరరావు, కొల్లి నాగేశ్వరరావు, పూర్వ విద్యార్థులు భరత్, రవి, విజయ్, నాగరాజు, నాగమణి, సుల్తానా, పున్నమ్మ, శ్రీలక్ష్మి పాల్గొన్నారు.

నేడు సాయిబాబా మందిర 19వ వార్షికోత్సవం

- అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం
- ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం



అన్నదాన ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం

మంగళగిరి (తాడేపల్లిరూరల్): మంగళగిరి తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలో పెదవడ్లపూడిలో ఉన్న భగవాన్ శ్రీ సత్య షిర్డి సాయిబాబా మందిరం 19వ వార్షికోత్సవాలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ కమిటీ చైర్మన్ పాతూరి నాగభూషణం తెలిపారు. ఆలయంలో ఆదివారం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వార్షికోత్సవాన్ని ఘనంగా నిర్వహిస్తున్నామని, భక్తులు వేల సంఖ్యలో పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. సోమవారం భక్తులు స్వామివారి దర్శనార్థం రానున్నారని, భక్తులు అన్ని ఏర్పాట్లు చేశామన్నారు. ఉదయం 5 గంటలకు బాబాకు కాకడ హారతి, ఆరు గంటలకు పాలాభిషేకం, 8 గంటలకు అన్నాభిషేకం, 9 గంటలకు ప్రత్యేక పూజా కార్యక్రమాల అనంతరం 10 గంటలకు సాంస్కృతి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నారు. సినీ గాయకులతో సంగీత విభావరి, జబర్దస్త్ కామెడీ షో కళాకారులతో హాస్యవల్లరి, మ్యాజిక్ షో వంటి పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సుమారు 70 వేల మందికి అన్నదాన కార్యక్రమాన్ని చేయనున్నామని తెలియజేశారు. రాష్ట్రంలోని వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ఎమ్మెల్యేలు, అధికారులు హాజరై బాబా వారిని దర్శించుకోనున్నారని పేర్కొన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకుని బాబ కృపకు పాత్రులు కావాలని ఆయన కోరారు.

ముగిసిన ఉచిత వైద్య శిబిరం



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి రూరల్ పరిధిలోని చిర్రావూరు గ్రామంలో మానవ సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఏపీడీఎంఎస్ఐడీసీ చైర్మన్ చిల్లపల్లి శ్రీనివాసరావు విచ్చేసి వైద్య శిబిరాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంతో ఖర్చుతో కూడుకున్న పరీక్షలు ఉచితంగా అందిస్తున్న మానవ సేవా సంస్థ సేవలు అభినందనీయమన్నారు. సంస్థ అధ్యక్షుడు వంగర సురేష్ మాట్లాడుతూ సుమారు 1,300 మందికి ఉచితంగా పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశామని తెలిపారు. ఈ శిబిరంలో వైద్యులు నిఖిల్, శశిధర్, అర్చన మాధురి, రాజశేఖర్, వంశీ, శ్రీకర్, కడియాల జయకృష్ణ, జాస్తి ప్రత్యక్ష, వినోద్, శ్రావణి తదితరులు తమ వైద్యసేవలను అందించారని తెలిపారు.

మైనర్లకు వాహనాలివ్వొద్దు



మంగళగిరి (తాడేపల్లిరూరల్): తల్లిదండ్రులు మైనర్లకు వాహనాలను ఇవ్వకూడదని మంగళగిరి పట్టణ ఎస్ఐ హరిబాబు సూచించారు. మంగళగిరి నగర పరిధిలోని ఆయా ప్రాంతాల్లో ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా హరిబాబు మాట్లాడుతూ మైనర్లు డ్రైవింగ్ చేయడం అత్యంత ప్రమాదకరమని అన్నారు. సరైన పత్రాలు లేకుండా వాహనాలు నడుపుతున్న వారికి కౌన్సెలింగ్ నిర్వహించి అపరాధ రుసుం వసూలు చేశామన్నారు. మైనర్లుగా ఉండి రోడ్డు ప్రమాదాలకు గురైతే వారి జీవితం నాశనం అవుతున్న విషయాన్ని పిల్లలకు తల్లిదండ్రులు తెలియజేయాలని, పాఠశాలల కళాశాలల యాజమాన్యాలు సైతం మైనర్ విద్యార్థులకు వాహనాలపై రాకూడదని వివరించాలని అన్నారు.

జ్ఞాపకార్థం చిత్రపటం బహూకరణ



తాడేపల్లిరూరల్ : అమరజీవి కామ్రేడ్ రావుల శివారెడ్డి మీద రూపొందించిన పాటను చిత్రపటంలో పొందుపరిచి, ఆయన సతీమణి బసవ పున్నమ్మకు ఆదివారం సీపీఐ నియోజకవర్గ సహాయ కార్యదర్శి కంచర్ల కాశయ్య నూతక్కిలోని స్వగృహంలో అందజేశారు. ఈ సందర్భంగా కంచర్ల కాశయ్య మాట్లాడుతూ అమరజీవి శివారెడ్డిపై ఉన్న అభిమానంతో ఓ పాటను రచించానని, ఆ పాటతో కూడి ఓ చిత్రపటాన్ని రూపొందించిన బహూకరణగా కుటుంబానికి అందజేసినట్లు ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు చిన్ని తిరుపతయ్య, జాలాది జాన్‌బాబు పాల్గొన్నారు.

రాజధానికి నిధులు కేటాయించకపోతే ఎలా?



నిరసన కార్యక్రమంలో పాల్గొన్న సీపీఎం నాయకులు



నిరసన ప్రదర్శన నిర్వహిస్తున్న సీపీఎం నాయకులు

తాడేపల్లిరూరల్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రాజధానికి నిధులు కేటాయించకపోతే ఎలా అభివృద్ధి సాధ్యమని సీపీఎం సీనియర్ నాయకులు వేముల దుర్గారావు, జొన్న శివశంకరరావు అన్నారు. ఆదివారం సీపీఎం రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా కేంద్ర ప్రభుత్వం బడ్జెట్‌కు వ్యతిరేకంగా ఉండవల్లి సెంటర్‌లో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ కార్పొరేట్‌లకు అనుకూలంగా ఉందని ఆరోపించారు. పేదల అభివృద్ధికి ఏ మాత్రం ఉపయోగపడని బడ్జెట్‌ను ప్రజలు వ్యతిరేకిస్తున్నారన్నారు. విభజన చట్టంలోని హామీలు అమలు చేయకుండా అధికారం చేపట్టిన కూటమి పార్టీలు రాష్ట్ర ప్రజలను మరోసారి మోసం చేశారని నాయకులు విమర్శించారు. రామకృష్ణ, ఈమని రామారావు, ఇమ్మానుయేలు, నారిన నాగేశ్వరరావు, బొబ్బిలి రామారావు, మేరి, శేషయ్య, శౌరి, దర్శనపు విజయ్, గాంధీ పాల్గొన్నారు.

బడ్జెట్‌లో రాజధానికి నిధులు నిల్

తాడికొండ: రాజధాని అమరావతి నిర్మాణానికి కేంద్ర బడ్జెట్‌లో నిధులు కేటాయించకపోవడం దుర్మార్గమని సీపీఎం రాజధాని డివిజన్ కమిటీ నాయకులు మండిపడ్డారు. కేంద్రం వైఖరిపై కమిటీ అధ్వర్యంలో తుళ్లూరు లైబ్రరీ సెంటర్‌లో నిరసన కార్యక్రమం నిర్వహించారు. నాయకులు ఎం.భాగ్యరాజు మాట్లాడుతూ రాజధాని నిర్మాణంపై మొదటి నుంచి బీజేపీ అవకాశవాద ధోరణి అవలంభిస్తోందన్నారు. గతంలో అమరావతి నిర్మాణ అంశం రాష్ట్ర ప్రభుత్వం పరిధిలోదని, తమకు సంబంధం లేదని బీజేపీ హైకోర్టులో అఫిడవిట్ దాఖలు చేసిందని గుర్తుచేశారు. 2024 ఎన్నికల ముందు అధికారం కోసం రాజధాని అమరావతి నిర్మాణానికి సహకరిస్తామని బీజేపీ నాయకులు కల్లబొల్లి మాటలు చెప్పారన్నారు. బడ్జెట్లో నిధులు కేటాయించకపోవడంపై డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ మాట్లాడాలని కోరారు. కేంద్రంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి తమ మద్దతు అవసరమని తెలిసీ చంద్రబాబు, పవన్ కళ్యాణ్ నోరు విప్పక పోవడాన్ని ప్రజలు గమనిస్తున్నారని దుయ్యబట్టారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పేరం బాబురావు, గైరబోయిన నాగేశ్వరరావు, జె నరేంద్ర, పి.శివయ్య, బి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌ను నిరసిస్తూ..

తాడేపల్లిరూరల్ : కేంద్రఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ పార్లమెంట్‌లో ప్రసంగంలో ఆంధ్రప్రదేశ్ ప్రస్తావన లేకపోవడం విచారకరమని సీపీఎం నాయకులు జెట్టి బాలరాజు అన్నారు. ఆదివారం దుగ్గిరాల గ్రామంలోని బోసుబొమ్మ సెంటర్‌లో బడ్జెట్‌ను నిరసిస్తూ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అమరావతి రాజధాని నిర్మాణం, విశాఖ ఉక్కు ఫ్యాక్టరీ, కేంద్ర విద్యా సంస్థలకు నిధులు వంటి వాటిపై కనీసం నిర్మల సీతారామన్ నోరు మెదపలేదని విమర్శించారు. ఈ కార్యక్రమంలో జి. శ్రీనివాసరావు, బి. చిరంజీవి, వెంకటస్వామి, నాగభూషణం పాల్గొన్నారు.

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు



లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో ధ్వజ స్తంభం వద్ద పూజలు

మంగళగిరి (తాడేపల్లిరూరల్) : వసంత పంచమి, మాఘ మాసం పురస్కరించుకుని మంగళగిరి, తాడేపల్లి పరిధిలో ఉన్న ఆలయాలు భక్తులతో ఆదివారం కిటకిటలాడాయి. ఆలయాల్లో అక్షరాభ్యాస కార్యక్రమాలు జరిగాయి. నగర పరిధిలోని లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో భక్తులు ధ్వజ స్తంభం వద్ద దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయంలో ఉన్న రాజ్యలక్ష్మి అమ్మవారిని దర్శించుకునేందుకు భక్తులు బారులు తీరారు. ఆయా ఆలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మాఘ మాసం, వసంత పంచమి కావడంతో భక్తులు అధిక సంఖ్యలో ఆలయాలకు తరలివచ్చారు. ఆయా ఆలయాల అధికారులు భక్తులకు అసౌకర్యం కలగకుండా ఏర్పాట్లు చేశారు.

గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఉపాధ్యాయులు

మంగళగిరి (తాడేపల్లిరూరల్): గ్రంథాలయాలు విజ్ఞాన భాండాగారాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. మంగళగిరి నగర పరిధిలోని వీవర్స్ కాలనీలో దామర్ల త్యాగరాజు – కోమల గ్రంథాలయ ప్రథమ వార్షికోత్సవం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వీవర్స్ కాలనీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఎస్. శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులను పుస్తక పఠనం వైపు మళ్లించేందుకు ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు చర్యలు తీసుకోవాలని సూచించారు. విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయాన్ని ఉపయోగించుకోవాలని, ప్రతి ఒక్కరు పుస్తకాన్ని చదివేందుకు రోజులో కొంత సమయాన్ని కేటాయించాలని సూచించారు. ఎస్ఎల్ఎమ్ చైతన్య విద్యా సంస్థల అధ్యక్షుడు శిందె బాలకృష్ణ మాట్లాడుతూ పిల్లలకు ఉపయోగపడే గ్రంథాలయాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. విద్యార్థులకు చిత్రలేఖనం, వ్యాస రచన పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేశారు. నిర్వాహకులు గోలిధర్మతేజకు ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్ వి. శ్రీనివాసరావు, అన్నవరపు ప్రదీప పాల్గొన్నారు.

17 నుంచి రక్షణ ఉజ్జీవ సభలు



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న రవిప్రకాష్ తదితరులు

మంగళగిరి (తాడేపల్లిరూరల్) : ఈ నెల 17వ తేదీ నుంచి రక్షణ ఉజ్జీవ సభలు నిర్వహించనున్నట్లు పాస్టర్ బొంతపురి రవిప్రకాష్ తెలియజేశారు. మంగళగిరినగర పరిధిలోని పార్కు రోడ్డులో ఉన్న ఇమ్మానియేలు చర్చిలో రక్షణ ఉజ్జీవ సభల గోడపత్రికను ఆదివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ ఈ సభలో 17, 18, 19 తేదీలలో మూడు రోజుల పాటు జరుగనున్నాయని తెలిపారు. ఈ సభలకు ప్రంగీకులుగా రెవ. బి. థాంప్సన్, దైవజనులు కె.జయకుమార్, పాస్టర్ ఎం.జాన్ వెస్లీ రానున్నట్లు పేర్కొన్నారు. ఈ సభలకు ప్రతి ఒక్కరు హాజరై సందేశాన్ని అందుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నన్నపనేని సురేష్, గుడిపాటి సునీల్, దేవరాజు పాల్గొన్నారు.